క్లుప్తంగా

ఎన్జీవో మహాసభ వాల్ పోస్టర్ ఆవిష్కరణ



ఎస్.అన్నవరంలో మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి రాజా, నాయకులు

తుని: విజయవాడలో ఈ నెల 21, 22 తేదీల్లో నిర్వహించే ఏపీ ఎన్జీవో సంఘ 21వ మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు జి.రామ్మోహనరావు కోరారు. శుక్రవారం సాయంత్రం వారు తుని మండలం ఎస్.అన్నవరం క్యాంపు కార్యాలయంలో మంత్రి దాడిశెట్టి రాజాను కలిశారు. మంత్రి రాజా మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. విజయవాడలో జరిగే మహాసభకు హాజరు కావాలని మంత్రి రాజాకు ఆహ్వానపత్రిక అందజేశారు. తుని ఏఎంసీ చైర్మన్ మాకినీడి బాబు, సంఘం జిల్లా కార్యదర్శి పి.వెంకట కృష్ణ, ఉపాధ్యక్షుడు పాలపర్తి మూర్తిబాబు, కెవీఎస్.ప్రసాద్ పాల్గొన్నారు.

పొదుపు సంఘాల అభివృద్ధిపై దృష్టి సారించాలి

రౌతులపూడి: మండలంలోని 26 పంచాయతీల్లో నిర్వహిస్తున్న పొదుపు సంఘాల అభివృద్ధిపై దృష్టి సారించాలని వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం సూర్యకుమారి సిబ్బందికి సూచించారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో వీఓఏలు, వీఓలు, సీసీలతో శుక్రవారం ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొదుపు సంఘాలు తీసుకున్న శ్రీనిధి, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్, వెలుగు రుణాలను నిర్ణీత సమయంలో వసూలు చేయాలన్నారు. వివిధ లీడ్‌బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను డ్వాక్రా మహిళలు సక్రమంగా చెల్లిస్తే తిరిగి రుణాలు తీసుకునే అవకాశం ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో సీసీలు సరస్వతి, ప్రకాశమ్మ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సింగరంపాలెంలో పొలంబడి

గండేపల్లి: మండలంలోని సింగరంపాలెంలో శుక్రవారం వైఎస్సార్ పొలంబడి నిర్వహించారు. ఖరీఫ్ సాగు చేసిన రైతులకు సస్యరక్షణ చర్యలపై మండల వ్యవసాయాధికారి ఎ.సద్గురుమూర్తి అవగాహన కల్పించారు. రైతులను ఐదు గ్రూపులుగా విభజించి పొలం పరిసరాలను చార్టుపై బొమ్మగా గీసి ప్రస్తుత వాతావరణం పరిస్థితుల్లో పంటలను ఏవిధంగా రక్షించుకోవాలో ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో వీఏఏ ఉదయ్, సత్యనారాయణ, వీహెచ్‌ఏ కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని పేదలకు పంచాలంటూ ధర్నా

ఏలేశ్వరం: మండలంలోని జె.అన్నవరంలో ప్రభుత్వ భూమిని పేదలకు పంచాలంటూ శుక్రవారం ధర్నా చేశారు. సీపీఐ (ఎంఎల్) వినోద్ మిశ్రా పార్టీ ఆధ్వర్యంలో జె.అన్నవరంలోని ప్రభుత్వ భూమి వద్ద ధర్నా చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కాశిరెడ్డి గణేష్ మాట్లాడుతూ జె.అన్నవరంలో సుమారు 26 ఎకరాల ప్రభుత్వ భూమిని కాజేయాలని కొందరు భూస్వాములు ప్రయత్నం చేస్తున్నారన్నారు. అమ్మకాలు జరగకుండా అధికారులు ఆ భూమి అడంగల్‌ను బ్లాక్ లిస్టులో పెట్టాలన్నారు. దీనిపై అధికారులు స్పందించకపోతే నిరాహార దీక్ష చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాడెం బాబూరావు, నాగులాపల్లి అర్జునుడు, మరువాడ నాగమణి, గండేటి నాగమణి, గుమ్మడి పాదాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రం తనిఖీ

కోటనందూరు: మండలంలోని టీజే నగరంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. కేంద్రంలో వర్మీ కంపోస్టు తయారు చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. తయారు చేసిన వర్మీ కంపోస్ట్ ఎంత నిల్వ ఉంది, ఎంత మేర విక్రయాలు చేశారు, సమకూరిన ఆదాయం ఎంత తదితర అంశాలకు సంబంధించి రికార్డులు తనిఖీ చేశారు. ఖరీఫ్ సీజన్ కావడంతో రైతులను ప్రోత్సహించి తయారు చేసిన కంపోస్టును పూర్తిగా విక్రయించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి రావాడ రామచంద్రకుమార్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని 133వ సత్యవిదియ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా రత్నగిరిపై చేసిన పుష్పాలంకరణ, సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. సుమారు వంద మంది రుత్విక్కులు పూజలు, అభిషేకాలు, జపాలు, పారాయణలు తదితర వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను ఉదయం వెండి రథంపై, రాత్రి వెండి గరుడ వాహనంపై ఊరేగించారు. స్థానిక కావ్యశ్రీ నృత్యకళాశాలకు చెందిన చిన్నారులు చేసిన నృత్యప్రదర్శన భక్తులను అలరించింది.

ఆనందాల హరిఇల్లు

- జగనన్న కాలనీల్లో జోరుగా ఇళ్ల నిర్మాణాలు
- సాకారమవుతున్న పేదల సొంతింటి కల
- కిర్లంపూడి మండలంలో 3945 మందికి స్థలాలు



వేలంక జగనన్న కాలనీలో నిర్మిస్తున్న ఇళ్లు

కిర్లంపూడి: తమ జీవితాల్లో వెలుగులు వచ్చాయని పేదలు మురిసిపోతున్నారు. మేము సొంతింటివారిమయ్యామని సగర్వంగా చెప్పుకుంటున్నారు. ఏళ్ల నాటి కల తీరందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా జగనన్న కాలనీల్లో పేదల ఇళ్లు రూపుదిద్దుకుంటున్నాయి. పేదల సొంతింటి కల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో నిజం అవుతోంది.

34 లే అవుట్లలో ఇళ్ల స్థలాలు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ఆధ్వర్యంలో కిర్లంపూడి మండలంలో 34 లేఅవుట్లలో 3945 మందికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. వీటిలో ఇళ్లు నిర్మించుకునే వారికి గృహనిర్మాణశాఖ నుంచి రుణాలు మంజూరు చేస్తున్నారు. ఈ మేరకు కిర్లంపూడి, వేలంక, సోమరాయణంపేట తదితర గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. లబ్ధిదారులకు ప్రభుత్వం గృహనిర్మాణ శాఖ ద్వారా రూ.1.80 లక్షల రుణం అందిస్తోంది. మహిళా సంఘాల సభ్యులకు రూ.50 వేలు అదనంగా రుణాలను బ్యాంకుల ద్వారా ఇస్తున్నారు. ఇళ్లు నిర్మించుకునే వారికి ప్రభుత్వం రాయితీపై సిమెంట్, ఇసుకతో పాటు ఐరన్ కూడా అందిస్తోంది.

వివిధ దశల్లో..

లబ్ధిదారుల ఇళ్లు పునాదుల వరకూ పూర్తయితే రూ.51,200, గోడలు నిర్మిస్తే రూ.53,200, శ్లాబ్ వేస్తే రూ.22,400, ప్లాస్టింగ్‌లు పూర్తయితే మరో రూ.23,200 నగదు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారు. మండలంలోని జగనన్న కాలనీల్లో ఇప్పటికే ఇళ్ల స్థలాల మెరక పనులు పూర్తయ్యాయి. కాలనీలకు రోడ్డు నిర్మాణం, విద్యుత్ సరఫరా, తాగునీరు వంటి సౌకర్యాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంటే.. ఇళ్ల నిర్మాణ పనుల్లో లబ్ధిదారులు బిజీగా ఉన్నారు. ఇప్పటికే కొంత మంది లబ్ధిదారులు సొంతింటిని నిర్మించుకున్నారు.

కిర్లంపూడి మండలంలో వివరాలు

జగనన్న కాలనీ	మంజూరైన ఇళ్లు	పునాది దశ	వివిధ దశల్లో ఉన్నవి	పూర్తయిన ఇళ్లు
కిర్లంపూడి	153	127	6	20
సోమరాయణంపేట	89	42	7	41
కృష్ణవరం	56	48	4	4
వేలంక	116	73	14	29
ముక్కొల్లు	132	102	7	23
మొత్తం	546	392	38	117

కల నెరవేరింది



ఏళ్ల తరబడి ఒకే ఇంట్లో నాలుగు కుటుంబాలు నివాసం ఉంటున్నాం. ఇరుకుగా ఉండడంతో అనేక ఇబ్బందులు పడ్డాం. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక మాకు ఇళ్ల స్థలం మంజూరైంది. ఆ స్థలంలో ప్రభుత్వ సాయంతో ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్నాం. ప్రస్తుతం మా సొంతింటి కల నెలవేరింది. సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం.

– దాడి అనుష, సోమరాయణంపేట, కిర్లంపూడి మండలం

అద్దె ఇంటిలో అవస్థలు పడ్డాం



మాది చిన్న కుటుంబం. నా భర్త తాపీ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. చాలా కాలంగా ఇద్దరు పిల్లలతో అద్దె ఇంట్లో జీవిస్తున్నాం. స్థలం కొని ఇల్లు కట్టుకోవాలనేది మా చిరకాల కోరిక. రోజువారి కూలి పనితో జీవనం సాగిస్తున్న మాకు ఇల్లు కట్టుకోవడం కలగానే మిగిలిపోతుందేమో అనుకునే వాళ్లం. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కిర్లంపూడిలో ప్రభుత్వం స్థలం ఇచ్చింది. ప్రభుత్వ సాయంతో ఇల్లు నిర్మించుకున్నాం. త్వరలోనే కొత్త ఇంటిలోకి వెళుతున్నాం.

–రాపేటి రమ, జగపతినగరం, కిర్లంపూడి మండలం

ఆనందంగా ఉంది



కూలి పనికి వెళితే గాని పూట గడవని పరిస్థితి మాది. ఏళ్ల తరబడిగా సొంతిల్లు నిర్మించుకోవాలని కలలు కన్నాం. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి మా కలను సాకారం చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక మాకు ఇళ్ల స్థలం వచ్చింది. ఆ స్థలంలో ఇల్లు కట్టుకుంటున్నాం. మా కల నెరవేరుతుండడంతో చాలా ఆనందంగా ఉంది.

– పంపన దేవి, లబ్ధిదారు, వేలంక

విద్యార్థులకు సత్య కంకణాల పంపిణీ

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని సన్నిధిలో శుక్రవారం సత్యవిదియ వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా విద్యార్థులకు సత్యకలాలు, సత్యకంకణాలను పంపిణీ చేశారు. సత్య విదియ వేడుకల్లో భాగంగా తొలిసారిగా ఈ ఆచారాన్ని ఈఓ చంద్రశేఖర్ అజాద్ ప్రారంభించారు.

నేడు వార్డు సభ్యుడి ఎన్నిక

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని గజ్జనపూడిలో శనివారం వార్డు సభ్యుడి ఎన్నిక నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి, ఎంఈఓ–2 అచ్చిరాజు తెలిపారు. గ్రామంలోని 6వ వార్డు సభ్యుడు నమ్మి శ్రీను ఏడాది క్రితం మరణించాడు. ఆ వార్డుకు ఎన్నిక నిర్వహిస్తున్నారు. వార్డు పరిధిలో 222 మంది ఓటర్లు ఉన్నారు. ఈ ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

ఎస్‌ఈబీ దాడుల్లో నలుగురి అరెస్టు

ప్రత్తిపాడు: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన దాడుల్లో నలుగురు నిందితులను అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్ఈబీ సీఐ పి.అశోక్ తెలిపారు. ప్రత్తిపాడు మండలం ఒమ్మంగిలో పది లీటర్ల సారాతో పెద్దిపాలెం గ్రామానికి చెందిన పళ్ల తాసు, కిర్లంపూడి మండలం సోమవరంలో పది లీటర్ల సారాతో వీధి చిన్నోడు (దాసు), కిర్లంపూడి కుమ్మరి వీధిలో ఐదు లీటర్ల సారాతో పింకి గణేశమ్మ, చిల్లంగిలో పది లీటర్ల సారాతో దెయ్యాల లక్ష్మిని అరెస్టు చేసినట్టు ఎస్సై వివరించారు. ఒమ్మంగిలో సారా స్థావరంపై దాడి చేసి సారా తయారీకి సిద్ధం చేసిన 800 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు చెప్పారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- తిరుమలాయపాలెంలో గడపగడపకూ మన ప్రభుత్వం



తిరుమలాయపాలెంలో మహిళలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గోకవరం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని తిరుమలాయపాలెంలో శుక్రవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరించారు. అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు అందని వారు ఎవరైనా ఉంటే వలంటీర్ల ద్వారా సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందన్నారు. స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వాటిని వెంటనే వాటిని పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. తొలుత గ్రామంలోని అప్పన్నబాబును ఎమ్మెల్యే దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు పాటి రాంబాబు, పార్టీ నాయకులు సుంకర వీరబాబు, కర్రి సూరారెడ్డి, పురంశెట్టి పెదబాబు, ఉప సర్పంచ్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నూతన భవనాలు ప్రారంభం

తిరుమలాయపాలెంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ, రైతు భరోసా, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ప్రారంభించారు. గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

యనమల ఆరోపణలు హాస్యాస్పదం

- రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా
- గెడ్లబీడులో జేసీఎస్ బీమా నమోదు కార్యక్రమం





సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రాజా, హాజరైన గృహసారథులు, కన్వీనర్లు, సర్పంచులు

తుని రూరల్: నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయకుండా ఆస్తులు కూడబెడుతున్నానని యనమల రామకృష్ణుడు ఆరోపించడంపై రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా ఆగ్రహం వ్యక్తం చేశారు. తుని మండలం గెడ్లబీడు వద్ద సాయి వేదికలో శుక్రవారం జేసీఎస్ ఇన్‌చార్జ్ సకురు నాగేంద్ర నెహ్రూ అధ్యక్షతన నియోజకవర్గ స్థాయిలో జేసీఎస్ బీమా నమోదు కార్యక్రమం జరిగింది. మంత్రి దాడిశెట్టి రాజా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను కోటనందూరు మండలంలో 150 ఎకరాలు కొనుగోలు చేసినట్టు ఎల్లో మీడియాలో యనమల ఆరోపించడం హాస్యాస్పదమన్నారు. తన పేరున, తన బంధువుల పేరుతో భూమి కొనుగోలు చేసినట్టు నిరూపిస్తే ఆ మొత్తం భూమిని ఆయనకే రాసిచ్చేస్తానన్నారు. 1983లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు రూ.1.50 లక్షలు డిపాజిట్ చేయాలని అప్పటి ఐక్య సంఘం కోరగా ఆ డబ్బులు లేని యనమల గ్రామ రైతుల పాస్ పుస్తకాలను హామీగా పెట్టిన సంగతి గుర్తు చేశారు. ఇప్పుడు యనమలకు దేశంలోని పలు నగరాల్లో ఆస్తులు ఉన్నాయన్నారు. 40 ఏళ్లలో నియోజకవర్గానికి యనమల చేసింది ఏమీ లేదన్నారు. ఉన్నత పదవుల్లో ఉన్న ఆయన నియోజకవర్గంలో తాగునీటి సదుపాయం కల్పించలేదన్నారు. నాలుగేళ్లలో 75 శాతం గ్రామాల్లో వాటర్ ట్యాంకులు నిర్మించి తాగునీరు అందించిన ఘనత తనకే దక్కుతుందన్నారు. నియోజకవర్గం మొత్తానికి ఎనిమిది రోడ్లు నిర్మించాల్సి ఉందన్నారు. ఆ రోడ్లకు త్వరలో శంకుస్థాపన చేసి నెల రోజుల్లో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. తునికి రిటైనింగ్ వాల్ నిర్మించి ప్రజలకు రక్షణ కల్పిస్తామన్నారు. పార్టీని నమ్ముకున్న కార్యకర్తలకు సీఎం జగన్ అండగా నిలుస్తున్నారని, బీమాతో ఆయా కుటుంబాలకు భరోసా కల్పిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో అబ్జర్వర్ చెల్లుబోయిన శ్రీనివాస్, పెరిక కార్పొరేషన్ చైర్‌పర్సన్ పురుషోత్తం గంగాభవానీ, ఏఎంసీ చైర్మన్ మాకినీడి బాబు, డీసీసీబీ డైరెక్టర్ పోలిశెట్టి సోమరాజు, పార్టీ నియోజకవర్గ యువత అధ్యక్షుడు ఏలూరి బాలు, పార్టీ పట్టణ, మండల కన్వీనర్లు రేలంగి రమణాగౌడ్, పోతల రమణ, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

పౌష్టికాహార కిట్ల పంపిణీ

తుని: ప్రతిఒక్కరూ మానసిక స్థైర్యం కలిగి ఉండాలని బ్రెడ్ స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ సాల్మన్‌రాజు సూచించారు. పట్టణంలోని బ్రెడ్ సంస్థ కార్యాలయంలో శుక్రవారం 32 మంది హెచ్ఐవీ వ్యాధి గ్రస్తులకు న్యూట్రిషియన్ కిట్లను పంపిణీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న మందులను క్రమం తప్పకుండా వాడి రోగ నిరోధక శక్తిని పెంచుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకుడు వడ్డాది ఏసుబాబు సూచించారు. బ్రెడ్ స్వచ్ఛంద సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. సంస్థ ప్రాజెక్ట్ మేనేజరు సూర్యకళ పాల్గొన్నారు.

'నాడు-నేడు' పనుల పరిశీలన

శంఖవరం: పాఠశాలల్లో జరుగుతున్న రెండో విడత నాడు–నేడు పనులను వేగవంతం చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రాఘవేంద్ర అన్నారు. మండలంలోని జి.కొత్తపల్లిలో జెడ్పీ హైస్కూల్లో జరుగుతున్న నాడు–నేడు పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఆయా పనులకు సంబంధించి కాంట్రాక్టర్లకు పలు సూచనలు చేశారు.

ఘనంగా శ్రీప్రకాష్ వ్యవస్థాపక వేడుకలు

అలరించిన గాతా రహే మేరా దిల్



గాతా రహే మేరా దిల్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, న్యాయ నిర్ణేతలు

తుని: స్థానిక శ్రీప్రకాష్ విద్యాసంస్థల వ్యవస్థాపక వేడుకలు శుక్రవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. తుని రెడ్ కాన్వెంట్ వీధిలోని శ్రీప్రకాష్ విద్యా సంస్థలో వేడుకలను విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. తుని, పాయకరావుపేట, అన్నవరం, పెద్దాపురం, కాకినాడ, రాజమహేంద్రవరం పాఠశాలల విద్యార్థులకు జూనియర్ విభాగంలోనూ, శ్రీప్రకాష్ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల విద్యార్థులకు సీనియర్స్ విభాగంలోనూ నిర్వహించిన గాతా రహే మేరా దిల్ పోటీలు అలరించాయి. కార్యక్రమానికి న్యాయ నిర్ణేతలుగా ప్రముఖ గాయకులు సుప్రీమ్ శేఖర్, కీ బోర్డు ప్లేయర్ జి.రామారావు వ్యవహరించారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. శ్రీప్రకాష్ విద్యాసంస్థను 47 ఏళ్ల పాటు విజయపథ్యంలో నడుపుతున్న వ్యవస్థాపకులు సీహెచ్‌వీకే నరసింహారావును అభినందించారు. విద్యార్థులు ఆలపించిన పాటలు అందరినీ అకట్టుకున్నాయి. శనివారం నిర్వహించే ముగింపు వేడుకులకు ప్రముఖ పకావజ్ విద్వాంసులు బలాజ్స్ విరాగ్, అంతర్జాతీయ యోగా గురువు దుర్గా ప్రసాద్ హాజరవుతారని ప్రిన్సిపాల్ మూర్తి తెలిపారు. ప్రోగ్రాం కన్వీనర్ సీతారాణి, ఏపీపీఎస్సీ సభ్యుడు సోనీవుడ్, విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక



ఏలేశ్వరంలో వైఎస్సార్ సీపీలోకి చేరిన వారికి కండువాలు వేస్తున్న కౌన్సిలర్ చలమయ్య

ఏలేశ్వరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారు. పట్టణంలోని రాజమండ్రి కాలనీకి చెందిన పలువురు టీడీపీ కార్యకర్తలు శుక్రవారం ఆ పార్టీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. వైఎస్సార్ సీపీ నాయకులు అలమండ చలమయ్య, తొండారపు రాంబాబు, మసిరపు నాగేశ్వరరావు, వాగు బలరామ్, శిడగం రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

తుని: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కల పెంపకాన్ని విరివిగా చేపట్టాలని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కలిదిండి సత్యనారాయణ రాజు కోరారు. తుని–పాయకరావుపేట రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం గ్రీన్ తుని కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, వరమహాలక్ష్మి ఆలయం, ధారాలమ్మ తల్లి గుడి, తుని పట్టణ, రూరల్ సర్కిల్ కార్యాలయాలు, బాలభవన్, బ్యాంకు కాలనీ తదితర ప్రాంతాల్లో 450 మొక్కలను నాటారు. రెడ్డి సంక్షేమ సంఘం చేస్తున్న కృషి అభినందనీయమని సత్యనారాయణ రాజు కొనియాడారు. రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు కర్రి కిశోర్ రెడ్డి, ఉపాధ్యక్షులు సత్తి లక్ష్మీనారాయణ రెడ్డి, కార్యదర్శి పోతంశెట్టి శ్రీనివాసరెడ్డి, కోశాధికారి మల్లిడి వెంకటరెడ్డి, కె.వెంకట రామలింగారెడ్డి, ద్వారంపూడి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత నేతాజీ సుభాష్‌చంద్రబోస్

ఏలేశ్వరం: స్ఫూర్తి ప్రదాత నేతాజీ సుభాష్‌చంద్రబోస్ అని విశ్వ హిందూ పరిషత్ ప్రతినిధులు అన్నారు. పట్టణంలో శుక్రవారం నేతాజీ సుభాష్‌చంద్రబోస్ వర్ధంతి నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక కోనేటిబడి వద్ద నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో నేతాజీ చేసిన పోరాటాలు, సేవలను కొనియాడారు. నేటి యువత నేతాజీ ఆశయాలను కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ ప్రతినిధి, విగ్రహ దాత తూమురౌతు గురయ్య, న్యాయవాది చిట్టంశెట్టి పుల్లయ్య, ఏడీవీ ప్రసాద్, తొండారపు రాంబాబు, ఉడతల రమణారావు, తొండారపు రాంబాబు, వాగుబలరామ్, మసిరపు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

కిర్లంపూడి: మండలంలోని వేలంక పుంతరోడ్డు రీ–సర్వే విషయంలో రెండు వర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. దీనిపై రెవెన్యూ సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు శుక్రవారం స్థానిక ఎస్సై బి.ఉమామహేశ్వరరావు తెలిపారు. వివారాల్లోకి వెళితే...రెవెన్యూ అధికారులు శుక్రవారం పొలాలకు వెళ్లే పుంత రోడ్డును రీ–సర్వే చేస్తుండగా గ్రామానికి చెందిన రెండు వర్గాల మధ్య వివాదం చెలరేగింది. పోలీస్ స్టేషన్‌కు సమాచారం రావడంతో ఇరువర్గాలకు సర్ది చెప్పి గ్రామంలో పోలీస్ పికెట్ నిర్వహించారు. రెండు వర్గాల వారు తమ విధులకు ఆటంకం కలిగించారని రెవెన్యూ సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై వివరించారు.

బాధితులకు చేయూత

గోకవరం: స్థానిక అచ్చియ్యపేటలో అగ్నిప్రమాద బాధితులను శుక్రవారం వైఎస్సార్ సీపీ నాయకులు పరామర్శించారు. అచ్చియ్యపేటలో పెద్దకాపు సత్యవతికి చెందిన పెంకుటిల్లులో ఇటీవల గ్యాస్ లీకే అగ్నికి ఆహుతైంది. ఈ ప్రమాదంలో సుమారు రూ.3 లక్షల ఆస్తినష్టం సంభవించింది. విషయం తెలుసుకున్న గోకవరం ఎంపీపీ సుంకర శ్రీవల్లి, వీరబాబు దంపతుల ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు శుక్రవారం బాధితులను పరామర్శించి ప్రభుత్వపరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. బాధిత కుటుంబాలకు బియ్యం, కూరగాయలను అందజేశారు. రెవెన్యూ అధికారులు బాధితులకు 20 కేజీల బియ్యం, కందిపప్పును అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర వీరబాబు, వరసాల ప్రసాద్, మంగరౌతు దుర్గ శ్రీనివాస్, కర్రి సూరారెడ్డి, నరాలశెట్టి నర్సయ్య, బిజ్జి రాజు పాల్గొన్నారు.

ఆలయాల్లో శ్రావణ సందడి

- కిటకిటలాడిన కోవెలలు
- అమ్మవార్లకు ప్రత్యేక పూజలు



జగపతినగరంలో అభయ దుర్గమ్మను దర్శించుకుంటున్న భక్తులు



ఎస్.అన్నవరంలో అమ్మవారికి విశేషాలంకరణ



జగ్గంపేటలో వాసవీమాతకు సారె తీసుకువెళుతున్న ఆర్యవైశ్య మహిళలు

తుని రూరల్: శ్రావణమాసంలో తొలి శుక్రవారం కావడంతో ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎస్.అన్నవరంలోని శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో మహాలక్ష్మి అమ్మవారికి అర్చకులు నవ కలశాలతో పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేషాలంకరణ చేశారు. సాయంత్రం పసుపు కుంకుమ, వివిధ రకాల గాజులతో సౌభాగ్యలక్ష్మీ అలంకరణ చేశారు. గోపూజ, స్వర్ణ పుష్పార్చన, సహస్ర కుంకుమార్చన, సహస్ర దీపాలంకర సేవలు నిర్వహించారు. కుమ్మరిలోవ తపోవనం ఆశ్రమంలో పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి ఆధ్వర్యంలో వేదపండితులు, వేద విద్యార్థులు రాజరాజేశ్వరి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు.

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శ్రావణ మాస తొలి శుక్రవారం సందర్భంగా చండీ హోమం నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమ గుండంలో హోమద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

అమ్మవార్లకు లక్ష కుంకుమార్చన

సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీసత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో రుత్విక్కులు లక్ష కుంకుమార్చన నిర్వహించారు. కొండ దిగువన కనకదుర్గ అమ్మవారికి అర్చకుడు ప్రయాగ రాంబాబు ఆధ్వర్యంలో రుత్విక్కులు లక్ష కుంకుమార్చన నిర్వహించారు.

కిర్లంపూడి: జగపతినగరంలో వేంచేసిన అభయ దుర్గమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కిర్లంపూడి శివారులో వేంచేసిన వనదుర్గమ్మ ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. స్థానిక, పరసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

వాసవీమాతకు సారె సమర్పణ

జగ్గంపేట: శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని జగ్గంపేటలోని వాసవీ మాతకు శుక్రవారం సారె సమర్పించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొత్త కొండబాబు ఆధ్వర్యంలో మహిళలు అమ్మవారికి సారెను ఊరేగింపుగా తీసుకువెళ్లారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలోని అమ్మవారికి సారె సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

వరలక్ష్మీదేవిగా దేవీచౌక్ కనకదుర్గమ్మ

గోకవరం: గ్రామంలో ప్రసిద్ధిగాంచిన దేవీచౌక్ కనక దుర్గమ్మ శుక్రవారం వరలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పవిత్ర శ్రావణమాసంలో మొదటి శుక్రవారం సందర్భంగా ఆలయ అర్చకులు వల్లూరి జగన్నాథశర్మ, శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో అమ్మవారిని వెండి, బంగారు ఆభరణాలు, వివిధ రకాల పూలతో సుందరంగా అలంకరించారు. ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. విశేష సంఖ్యలో మహిళలు అమ్మవారిని దర్శించుకున్నారు.